కళాశాలలో లెక్చరర్లను వెంటనే నియమించాలి

భిక్కనూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్ల పోసుల్టను వెంటనే భర్తీ చేయాలని టీజీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ జోతిర్మయి రాధాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీజీవీపీ మండల అధ్యక్షుడు భరత్‌రాజ్ మాట్లాడుతూ కళాశాలలో కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, కళాశాల అధ్యక్షుడు విద్యాసాగర్, శ్రీనిధి, పాల్గొన్నారు.


కామారెడ్డి జిల్లా కోర్టు సముదాయం

బలోపేతం దిశగా న్యాయ వ్యవస్థ

- గతంలో ఉన్న చట్టాల స్థానంలో మరో మూడు కొత్త చట్టాలు
- సంవత్సరం కిందట కొత్త చట్టాలు అమలులోకి
- జిల్లాకేంద్రంలో ఆరు ప్రధాన న్యాయ స్థానాలు

నేడు అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

కామారెడ్డి, జూలై 16(ఆంధ్రజ్యోతి): న్యాయ స్థానాల్లో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో న్యాయవ్యవస్థలో కొత్త చట్టాలను అమలులోకి తీసుకువస్తున్నారు. కోర్టు మెట్లు ఎక్కే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా కొత్త చట్టాలను రూపొందించారు. సంవత్సరం నుంచి న్యాయ వ్యవస్థలో మూడు కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయి. దీనికి తోడు లోక్‌అదాలత్ ద్వారా వందలాది కేసులు పరిష్కారం అవుతున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు చట్టసభలో కొత్త చట్టాలను అమలులోకి తీసుకు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుందలో న్యాయస్థానాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 14 వేల వరకు కేసులు ఉన్నట్లు న్యాయాధికారులు చెబుతున్నారు. గురువారం అంతర్జాతీయ న్యాయదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జూలై 17న అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా గుర్తింపు

అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జూలై 17న జరుపుకుంటారు. న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ దినోత్సవం లక్ష్యం. హోంశాసనాన్ని చారిత్రాత్మకంగా స్వీకరించడానికి గుర్తుగా జూలై 17 న అంతర్జాతీయ న్యాయదినోత్సవం జరుపుకోవాలని 1998లో నిర్ణయించారు. శిక్ష అర్హతకు వ్యతిరేకం, పోరాటం కొనసాగడం, యుద్ధనేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరాలు మరణహోమంలో జరిగే బాధితులకు న్యాయం చేయడం వంటి ప్రాముఖ్యాన్ని ఈ దినోత్సవం సూచిస్తుంది. న్యాయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఐక్యంగా న్యాయం కోసం పోరాటం చేయడం అలాగే బాధితుల హక్కుల కోసం

(మిగతా 8వ పేజీలో)

భిక్కనూరు ఆర్టీఏ చెక్‌పాయింట్



భిక్కనూరు.. ఆర్టీఏ చెక్ పాయింట్‌పై ఏసీబీ దాడి


డబ్బులు తీసుకుని వస్తున్న వాహనాల డ్రైవర్లు


చెక్‌పాయింట్ అధికారులను వివరాలు అడుగుతున్న ఏసీబీ అధికారులు

- నలుగురు ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు
- రూ.68వేల నగదు, 39 సెల్‌ఫోన్లు సీజ్

భిక్కనూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీఏ చెక్ పాయింట్‌పై ఏసీబీ అధికారులు డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి దాడులు నిర్వహించారు. ఆర్టీఏ చెక్ పాయింట్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో దాడులు నిర్వహించగా 39 సెల్‌ఫోన్లు, రూ.68 వేల నగదును సీజ్ చేయడంతో పాటుగా నలుగురు ప్రైవేటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆర్టీఏ చెక్‌పాయింట్‌పై వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ఉదయం నుంచి తనిఖీ చేయడం జరిగిందని ఈ సమయంలో ఎలాంటి వివరాలు లేని కార్యాలయంలో గల 39 సెల్‌ఫోన్లను, సాయంత్రం 4 గంటల వరకు రూ.68వేల నగదును స్వాధీనం చేయడం జరిగిందని, ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని, వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనానికి కొంత చొప్పున డబ్బులను తీసుకువచ్చి కార్యాలయ సిబ్బంది ఇస్తున్నారని, ఈ సంఖ్య సాయంత్రానికి మరింత పెరగవచ్చునని తెలిపారు. అదుపులోకి తీసుకున్న నలుగురి వివరాలను తీసుకుని పంపించడం జరిగిందని, అవసరమైనప్పుడు వారిని విచారణకు హాజరు కావాలని సూచించినట్లు తెలిపారు. ఈ తనిఖీ పూర్తి నివేదికను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా అధికారులు లంచం అడిగితే తమ టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు గానీ, తమకు గానీ 94404 46106కు గానీ వాట్సప్‌లో సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నగేష్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

వద్దంటే డబ్బులు ఇస్తున్నారు..

చెక్‌పాయింట్‌లో తనిఖీలు జరుగుతుండగా వాహనదారులు కౌంటర్‌లో వాహనానికి కొంత చొప్పున డబ్బులను పెడుతున్నారు. ఏసీబీ అధికారులు డబ్బులు ఎందుకు ఇస్తున్నారని వాహనదారులను ప్రశ్నించగా తమకు ఇది మాములేనని, ఇక్కడ తప్పకుండా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఏసీబీ అధికారులు వద్దన్నా డబ్బులు ఇస్తుండటంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న వాహనాల పత్రాల కౌంటర్‌ల వద్ద ప్లాస్టిక్ డబ్బాలను ఏర్పాటు చేయగా వాహనదారులు దానిలో డబ్బులు వేశారు. ఈ మేరకు డబ్బులు ఇస్తున్న వారి పేరు వాహనం నెంబర్, ఎక్కడికి వెళ్తుందన్న వివరాలను ఏసీబీ అధికారులు నమోదు చేసుకున్నారు.

జాగ్రత్త పడ్డ ఆర్టీఏ చెక్‌పాయింట్ సిబ్బంది

అసలు ఆర్టీఏ చెక్ పాయింట్‌పై మంగళవారమే దాడి జరగాల్సి ఉండగా ఆ సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందికి అనుమానం కానీ సమాచారం కానీ అందడంతో జాగ్రత్త పడ్డట్లు సమాచారం. దీంతో మంగళవారం దాడి జరగకపోవడంతో ఊపిరి పీల్చుకుని రాత్రి నుంచి మరల వాహనదారుల నుంచి డబ్బులు వసూళ్ల చేశారని, బుధవారం ఉద యం పకడ్బందీగా ఏసీబీ అధికారులు దాడి చేయడంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయినట్లు సమాచారం. ఈ విషయాన్ని డీఎస్పీని అడగగా తాము రాత్రి నుంచి ఇక్కడికి చేరుకున్నామని తెలిపారు. చాలా సంవత్సరాలుగా ఈ చెక్‌పాయింట్లపై ఆరోపణలు వస్తున్నా ఏసీబీ దాడులు జరగలేదు.

ప్రభుత్వ శాఖలపై ఏసీబీ నజర్

- ఇటీవల కాలంలో దూకుడు పెంచిన ఏసీబీ
- లంచం తీసుకునే వారిపై నిఘా
- పక్షం రోజుల్లోనే ఆర్‌టీఏ చెక్ పోస్టుల్లో తనిఖీలు

కామారెడ్డి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి రాజ్యమేలుతోంది. వేల రూపాయల్లో వేతనాలు పొందుతున్నా చేయి తడపందే పని కాదనే రీతిలో కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఏసీబీ దాడుల్లో పట్టుబడుతున్న వారిని చూస్తున్న కొందరు తమ తీరు మాత్రం మార్చుకోవడం లేదు. పైగా కొత్త తరహాలో మధ్యవర్తులు, ఇతర మార్గాల్లో లంచం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖల్లోని పలువురు అధికారులపై ఏసీబీ నజర్ పెట్టినట్లు తెలుస్తోంది. లంచం తీసుకునే వారిపై నిఘా పెట్టి పక్కా ప్రణాళికతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. పక్షం రోజుల వ్యవధిలోనే జిల్లాలోని ఆర్‌టీఏ చెక్‌పోస్టులపై

(మిగతా 8వ పేజీలో)


మహిళలకు చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ శివారులోని ఎస్ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. పోచారం రాకతో మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు తయారు చేసే దిశగా ముందు సాగాలన్నారు. అర్హులైన మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. 2024 - 25 సంవత్సరానికి గాను నియోజకవర్గంలో రూ.3 కోట్ల 76 లక్షల రూపాయల వడ్డీ వాపసు చెక్కును అందజేశారు. అనంతరం ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ మెషినరీల సహాయంతో తొందరగా ఆహార పదార్థాలకు అవసరమైన పిండి, పసుపు, అల్లం, వెల్లుల్లి పేస్టు తయారు చేసి సభ్యులకు అందజేసి లాభపడాలన్నారు. కాగా బుధవారం సాయంత్రం పట్టణ శివారులోని ఎస్ఎంబీ గార్డెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గాను 2వేల కోట్ల రూపాయలను సిద్ధంగా ఉంచిందన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి డీఆర్‌డీవో సురేందర్, అడిషనల్ డీఆర్‌డీవో విజయలక్ష్మీ, డీపీఎం, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, సీసీ, వివోఏలు, అధికారులు, ప్రజాప్రతినిదులు తదితరులున్నారు.

ఘనంగా వన మహోత్సవ సంబరాలు

గాంధారి, జూలై 16(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం ముదేళ్లి అటవీ కార్యాలయ ప్రాంగణంలో అటవీ అధికారులు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడాలని, చెట్ల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ హేమచందన, మోహన్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్ చంద్ర, ఉపాధ్యాయులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, మొరం అందజేస్తాం


అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు ఇసుక, మొరం అవసరం పడినప్పుడు పంచాయతీ సెక్రెటరీకి దరఖాస్తు సమర్పిస్తే ఉచితంగా అందేలా చూస్తామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. బుధవారం జిల్లాలోని ఆర్‌డీఓలు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ఇందిరమ్మ లబ్దిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వబడుతుందని రవాణా ఏర్పాటు లబ్దిదారులే చేసుకోవాలని తెలిపారు. అంతేకాక ఇసుక లభ్యత లేనట్లయితే పక్క మండలం నుంచి ఇసుకను పొందవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు మొరం అవసరమైన వారు పంచాయతీ కార్యదర్శి సిఫారసతో ట్రాక్టర్‌కు 300 చొప్పున టిప్పర్‌కు 1200ల చొప్పున డీడీ రూపంలో చెల్లించి అనుమతి పొందవచ్చని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ వారిని స్థానిక అవసరాల నిమిత్తం ఇసుక కొరకు కిష్టాపూర్, హస్గుల్, కుర్ల,ఖత్‌గావ్,షెట్లూర్‌లకు పర్యవరణ అనుమతులకు తగు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

కామారెడ్డి జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాలియా బుధవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన ప్రమోషన్‌పై జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు.

డీఈఈటీ అప్లికేషన్ పోస్టర్‌ల ఆవిష్కరణ

ప్రభుత్వశాఖలు, ప్రైవేట్ సంస్థలు, విద్య సంస్థల సమన్వయంతో ఉద్యోగార్థులకు, ఉద్యోగదారులకు రాష్ట్రప్రభుత్వంచే నిర్వహించబడుతున్న డీఈఈటీ(ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ఆఫ్ తెలంగాణ) పోస్టర్‌నుకలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు.ఈ అప్లికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రం రూమ్‌నంబర్ 122లో సంప్రదించాలని సూచించారు.

గౌరవంగా జీవించడమే మానవ హక్కు



అడ్లూర్ ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సలీం

సమాచారహక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షుడు సలీం

సదాశివనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హ్యూమన్‌రైట్స్ అంటే ఒక మనిషిస్వేచ్ఛగా, ఒత్తిడి లేకుండా, నిర్భయంగా, హుందాగా, ఆర్థికంగా, గౌరవప్రదంగా, సామాజికంగా తన జీవితాన్ని ఆనందంగా గడపడమేనని మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ద్వితియ శ్రేణి న్యాయవాది సలీం అన్నారు. మంలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలో బుధవారం మానవహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పుట్టుకతోనే స్వేచ్ఛగా పుట్టిన తాను ఎదుగుతున్న సమయంలో నిత్యజీవితంలో కొన్ని హక్కులను కోల్పోతూ వస్తున్నాడని, జాతీయ మానవ హక్కుల కమీషన్ భారతదేశ స్థాయిలో ప్రజల యొక్క హక్కులను కాపాడటం కోసం ఒక రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థగా ముందుకెళ్తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న మానవహక్కుల దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. మానవహక్కుల కమీషన్‌ను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షబానా, రాష్ట్ర సలహాదారులు రమణరెడ్డి, జోనల్ అధ్యక్షులు ప్రదీప్, శివ, పూజ, లింబయ్య, సాధక్, మాధురి, శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గాంధీభవన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ భాగస్వాములపై విచారణ జరపాలి

- దోపిడీదారుల ఆస్తులు జప్తు చేసి పేద ప్రజలకు పంచాలి
- గాంధీ భవన్ ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యం అయిన వారి ఆస్తులపై విచారణ జరిపి దోపిడీదారుల ఆస్తులు జప్తు చేసి పేద ప్రజలకు పెంచాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో పని చేసిన ఈఎన్సీ మురళీధర్ రావుపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఒక్క రోజు ఏసీబీ దాడులు చేస్తే 500 కోట్లపైన ఆస్తులు ఉన్నాయంటే, 80 వేల పుస్తకాలు చదివి ప్రాజెక్టు డిజైన్ చేసిన అని చెప్పుకున్న కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ దగ్గర ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరిపై విచారణ జరపాలని అన్నారు. కెసిఆర్ అసమర్థతతో ప్రాజెక్టులు పూర్తి కాలేదని బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల ఇరిగేషన్ శాఖను కెసిఆర్, హరీష్ రావు వారే చూశారని అన్నారు. ఆయనతోపాటు జిల్లా సీనియర్ నాయకులు లింగా గౌడ్, చింతల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ప్రకటించిన ప్రభుత్వం

- జిల్లాలో 25 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- 233 ఎంపీటీసీ స్థానాలు

కామారెడ్డి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనుంది. మొదట పరిషత్ ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలను ఖరారుచేస్తు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 25 జడ్పీటీసీ, 25 ఎంపీపీ, 233 ఎంపీపీ స్థానాలను ఖరారుచేసింది. గతంలో జిల్లాలో 22 జడ్పీటీసీ స్థానాలు ఉండగా కొత్తగా మూడు మండలాలు పల్వంచ,డొంగ్లి,మహ్మద్‌నగర్ మండలాలు ఏర్పడడంతో వాటిని కలుపుకొని 25 జడ్పీటీసీ స్థానాలకు పెరిగాయి.అదేవిధంగా 232 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం ఒకటి పెరగడంతో 233కు చేరింది. ప్రభుత్వం ప్రకటించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనుంది.

ఇందిరమ్మ ఇళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

దోమకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నిగ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల గురించి చర్చించి ఇళ్లు మంజూరైనా ప్రతి లబ్దిదారుడు వెంటనే మార్కౌట్ చేసుకుని పనులు ప్రారంభించే విధంగా కృషి చేయాలన్నారు. హరితహారంలో బాగంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇకనైన రోగులకు మెరుగైన సేవలు అందేనా?

- నేడు జీజీహెచ్‌లో హెచ్‌డీఎస్ సమావేశం
- హాజరుకానున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ
- ఆయా నియోజక వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఎమ్మెల్యేలు పరిష్కారం చూపాలి
- అనర్హులకు కేటాయించిన ఉన్నత పదవులకు ముగింపు చేసేనా?

కామారెడ్డి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్య భారిన పడో.. 9 నెలలు నిండి ప్రసవం కోసం ఆసుపత్రికి వస్తున్న వారికి.... రాత్రివేళలో ప్రమా దం జరిగో... లేదంటే అస్వస్థతకు గురై జీజీహెచ్(గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి)కి వస్తున్న జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అంద డం గగనమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్య ం ఆసుపత్రికి వస్తున్న దాదాపు 10 మందిలో కనీ సం 8 మంది మాకు మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పడం లేదంటే ఏ స్థాయిలో సేవలు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రిలో సేవలు అందడం లేదంటూ ఎమ్మెల్యేలకు, ఎంపీకి చోటా మోటా నాయకులు కార్యకర్తలు, ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నారో లెక్కే లేకుండా పో తుంది. ప్రజావాణిలో పలుమార్లు కలెక్టర్ దృష్టికి ఆసుపత్రి సేవలపై ఫిర్యాదులు చేస్తున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. రాత్రివేళలో ఆసుపత్రికి సేవల కోసం వస్తే 10 కేసులలో 7 రిఫర్ చేయడం జరుగుతుందనే విమర్శలు లేకపోలేదు. రిఫర్ కేసులకు సంబంధిచిన రికార్డులను పరిశీలిస్తే విష యం బట్టబయలు అయ్యే అవకాశం ఉంది. ఇటివల హెచ్‌డీఎస్ నిధులు పక్కదారి పట్టిన విష యం ఆసుపత్రి అంతా కోడై కూస్తున్న చర్యలు మాత్రం లేవు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, వైద్యుల పనితీరు,సమయపాలన, కొందరు పెత్త నం, అనర్హులకు ఉన్నత పదవులు కేటాయించడం వీటన్నింటిపై నేడు జరగనున్న హెచ్‌డీఎస్ మీటింగ్‌లో చర్చించి ఇకనైన మార్పు తీసుకువచ్చి..రోగులకు మెరుగైన సేవలు అందేలా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు చూస్తారో లేదో వేచిచూడాలి.

సేవలు, నిధుల పక్కదారి, పలువురి పెత్తనంపై చర్చ జరిగేనా?

ఆసుపత్రికి వస్తున్న ప్రజలకు మెరుగైన సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఉదయం విధులకు లేటుగా హాజరయ్యే కొందరు సిబ్బంది సమయంకాకముందే ఆసుపత్రి గేటు బయటపడుతుంటారనేది జగమెరిగిన సత్యం. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌రైలు వచ్చే సమయం ఆసన్నమైతుందంటే ఆపరేషన్ థీయేటర్‌లో ఉన్న వారైన కిందిస్థాయి సిబ్బందికి చికిత్సలు అందించాలని కొందరు వైద్యు లు చెప్పి వెళ్లిపోతుంటారు. ఇక గర్బిణులకు సేవ లు అందాలంటే ప్రసవ నొప్పులకంటే వైద్యులు,సిబ్బంది మాట్లాడే మాటలు భరించాలి. ఆ మాటలు దాటి బయటకు వచ్చాక అవసరం లేని వైద్యభాషను ఉపయోగించి పరీక్షలు చేయించుకోనిరావాలని సూచిస్తే చేయించుకోని రావాలి లేదంటే సేవ లు మరోరోజుకు పోస్టుపాండ్ అవుతాయి. రాత్రివేళలో ప్రసవంకు వచ్చిన, అత్యవసర సేవలకు వచ్చిన కొన్ని సందర్భాలలోనే సేవలు అందుతాయని వాటిని సైతం వేళ్ల మీద లెక్కపెట్టవచ్చనే ఆరోపణలు లేకపోలేదు. ఇక ఆరోగ్యశ్రీ, ఆబా, తదితర నిధుల పక్కదారిపై ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైన ఉంది. విధులు నిర్వహించేందుకు అర్హులు కాని వ్యక్తులకు ఇతర ప్రాంతాల్లో పనిచేసి పనిష్మెంట్‌కు గురై విచారణ జరుగుతుండగానే నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవులను చేపట్టడంతో పాటు టక్కుటమారా విద్యలను ప్రదర్శించి నిధుల గోల్‌మాల్ చేసి న వ్యక్తులపై సమావేశంలో దృష్టిసారించాలి. ఇక కొన్నేండ్లుగా ఆసుపత్రిలో పెత్తనం చెలాయిస్తు వచ్చిన ప్రతి సూపరిటెండేంట్‌ను మచ్చిక చేసుకుంటూ తనకు అడ్డుగా ఉన్నవారిని పక్కకి తప్పించే


కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి

(మిగతా 8వ పేజీలో)

దొరల పాలన కాదు కాంగ్రెస్‌ది ప్రజాపాలన

● పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

మోర్తాడ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తుందని, దొరల పాలన కాదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బాసవేణుగోపాల్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నట్లు భ్రమ పడుతున్నారని, ఆ భ్రమనుంచి బయటకురావాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే తన ఇంట్లో పంపిణీ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పాలకులు, అధికారులు గాని ప్రభుత్వ కార్యాలయాలలో, లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి చెక్కులను పంపిణీ చేయాలన్న విషయం ఎమ్మెల్యేకు తెలియదా అని ప్రశ్నించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, మహిపాల్, నసీర్, జైడి చిన్నగంగారాం, నాగభూషణం, అమ్జాద్, నవీన్, రవి, మహేష్, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాస వేణుగోపాల్ యాదవ్

కోటగిరి ఏఎస్ఐ బదిలీ

కోటగిరి,జూలై16(ఆంధ్రజ్యోతి): కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రహీం నిజామాబాద్ వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐని ఎస్ఐ సునీల్‌తో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం అయిన ఉత్తమ సేవలు అందించిన వారికే తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బస్సీలాల్, హెడ్‌కానిస్టేబుల్ ధర్మేందర్, సిబ్బంది యాదగిరి, జైపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కోనాపూర్ సమీపంలో దారిదోపిడీ

● కత్తులతో బెదిరించి రూ.3 లక్షల 50 వేలు దోపిడీ
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

కమ్మర్‌పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామసమీపంలో బుధవారం మధ్యాహ్నం భారీ దారి దోపిడీ జరిగినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్‌రెడ్డి తెలిపారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోరుట్ల మండలం జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ముల లక్ష్మీనారాయణ తన మిత్రుడు జలంధర్‌తో కలిసి భీమ్‌గల్‌లో హార్వెస్టర్ కొనుగోలు నిమిత్తం 3లక్షల50 వేల నగదుతో బైక్‌పై బయలుదేరారు. వీరు కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గ్రామం మీదుగా భీమ్‌గల్ వైపు వెలుతుండగా అప్పటికే గ్రామశివారులోని రంగనాయకుల గుట్ట దాటి వీరికోసం నంబర్‌లేని స్కూటీపై కాపుకాస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వీరిబైక్‌ను అడ్డంగించి కత్తులో బెదిరించి వారి వద్ద ఉన్న 3లక్షల నగదుతోపాటు ఇద్దరి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లను లాక్కొని బైక్‌స్టార్ట్ కాకుండా బైక్‌కీలను లాక్కోవడంతో పాటు వైర్లు సైతం లాగేసి పారిపోయినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఈ విషయమై బాధితుడు కమ్మర్‌పల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకున్న కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్‌రెడ్డి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, కోరుట్ల పోలీసులు సైతం సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.

బిచ్కుందలో దారుణహత్య

బిచ్కుంద, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అడికె రమేష్ (40) అనే వ్యక్తి దారుణహత్యకు గురైనట్లు సీఐ రవికుమార్, ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. రమేష్ అనే వ్యక్తికి పదిసంవత్సరాల క్రితం మహాదేవితో వివాహం జరిగిందని, వారికి ఇద్దరు సంతానం ఉన్నారన్నారు. గత సంవత్సరం నుంచి దంపతుల మధ్య గొడవతో మృతుడి భార్య తన పుట్టింటికి వెళ్లిపో యింది. అప్పటి నుంచి రమేష్ ఊరడమ్మ వద్ద పటేల్ మారుతి ఇంటిలో కిరాయికి ఉంటున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు పెద్దదేవాడ గ్రామానికి చెందిన కాశీనాథ్ హైదరాబాద్ నుంచి వచ్చి రమేష్ ఇంటికి వెళ్లి అతని చేతిలో ఉన్న కమ్మకత్తితో రమేష్ తలపై, వీపులో వేటు వేశాడు. దీంతో అక్కడికక్కడే రమేష్ కుప్పకూలిపోయినట్లు తెలిపారు. వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో హత్యజరిగినట్లు సమాచారం. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ, ఎస్ఐలు తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

నవీపేట,జూలై16(ఆంధ్రజ్యోతి): నవీపేట, జానకంపేట రైల్వే స్టేషన్‌ల మధ్యన బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి సుమారు 20 నుంచి 25సంవత్సరాల వయసు గల యువకుడు మృతి చెందాడని రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ సాయి కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని రైల్వే ఎస్ఐ తెలిపారు.

రెండు మొరం టిప్పర్ల పట్టివేత

నవీపేట,జూలై16(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం సమీపంలో మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రెండు మొరం టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. ఎడపల్లి మండలం జానకంపేట నుంచి అభంగపట్నం అక్రమంగా మొరాన్ని తరలిస్తుండగా రెండు మొరం టిప్పర్లను జగ్గారావు ఫారం వద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా విషయంపై నవీపేట పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ వినయ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసు సిబ్బంది కలిసి నాళేశ్వర్ వాగులో ఇసుక తరలింపు విషయంపై వాకబు చేశారు. నాళేశ్వర్‌కు చెందిన ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని నందిపేట పీఎస్‌కు తరలించినట్లు తెలిసింది.

రెండు నెలలు చేపలు పట్టడం నిషేధం

నవీపేట,జూలై16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి నుంచి నవీపేట మండలం నాళేశ్వర్ వరకు ఉన్న గోదావరి నది పరివాహక ప్రాంతంలో రెండునెలల పాటు చేపలు, రొయ్యలు పట్టడాన్ని నిషేధించినట్లు నిజామాబాద్ మత్స్యఅభివృద్ధి అధికారి లాయక్ మొయినోద్దీన్ తెలిపారు. తల్లిచేపలు సంతాన ఉత్పత్తి చేయడానికి ఈ రెండు నెలల పాటు అనుకూలమైన సమయం అయినందున జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు పట్టడాన్ని నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నవీపేట,జూలై16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు సమీపంలో బుధవారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. రెంజల్ మండలం కళ్యాపూర్‌కు చెందిన షాకీర్ నవీపేట నుంచి బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీబస్సు ఎదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రెంజల్,జూలై16(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులు పట్టుబడడంతో కేసు నమోదు చేసి కోర్టుకు పంపగా మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కువైట్‌లో కొండూర్ యువకుడి మృతి

సిరికొండ జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కువైట్ దేశంలో చనిపోయిన కొండూర్ గ్రామానికి చెందిన గణేష్‌అనే యువకుడి మృతదేహం స్వగ్రానికి చేరుకోగా బుధవారం అంత్యక్రియలు జరిగాయి. సిరికొండ మండలం కొండూర్ గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు బతుకుదెరువు కోసం కువైట్ దేశం వెళ్లాడు. గత కొన్నేళ్లుగా వెళుతూ వస్తున్నాడు. కువైట్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించే వారు. ఈ నెల 12న గుండె పోటు రావడంతో అయన చనిపోయాడు.

వ్యాధులను అరికట్టాలని సబ్‌కలెక్టర్‌కు వినతి

బోధన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతపై చేస్తున్న ప్రచారానికి తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బుధవారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కాగానే విస్తృతంగా వ్యాపించేటువంటి వ్యాధులను అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నాగమణి, ఇంద్ర, రేణుక, పద్మ, సుమ, సుశీల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాల్లోని సమస్యలు పరిష్కరిస్తాం'

బోధన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. బుధవారం బోధన్‌లోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి నవీన్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్ టౌన్ , జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన బండమీది సుభాష్ (33) సికింద్రాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతుడు సుభాష్ మద్యానికి బానిసవడంతో తండ్రి మందలించినందుకు సుభాష్ క్షణికావేశంలో సోమవారం గుర్తుతెలియని మందు తాగగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

రెంజల్ : మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మిబాయి(72)అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం నిజామాబాద్ డిపో 1కు చెందిన ఆర్టీసీ బస్సు తాడ్‌బిలోలి వెళ్తుండగా బోర్గాం గ్రామంలో బస్సు దిగే క్రమంలో లక్ష్మిబాయి చీరకొంగు డోర్‌కు తట్టుకుని కింద పడిపోగా బస్సు వెనుక టైర్ మహిళ కాలుపై నుండి వెళ్లగా చికిత్స కోసం నిజామాబాద్ తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని మృతురాలి అల్లుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ జయరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బోధన్‌రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని ఫత్తేపూర్ గ్రామశివారులో రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి లక్షా 31వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారికి బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి వారికి ఒక్కొక్కరికి 3వేల జరిమానాతో పాటు ఒక రోజు జైలుశిక్ష విధించారని వివరించారు.

విద్యార్థి అదృశ్యం



కేతావత్ పవన్

బోధన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మంగళవారం సాయంత్రం కేతావత్ పవన్ అనే యువకుడు బోధన్ పోస్టాఫీస్ ఏరియాలో విజ్ఞాన్ కోచింగ్ సెంటర్‌లో హాస్టల్‌లో ఎవరికి చెప్పకుండా బ్యాగ్ తీసుకుని వెళ్లిపోవడం జరిగిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బాలుడు తప్పిపోయిన విద్యార్థి రాజీవ్‌నగర్ తండా గ్రామానికి చెందిన వాడని, బంధువుల వద్ద తెలిసిన వెతికిన సమాచారం రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తప్పిపోయిన విద్యార్థి కేంద్రీయ విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్నాడన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. సీసీ పుటేజీల ద్వారా విద్యార్థి ఆచూకీ కనుకుంటామన్నారు.

మిషన్ భగీరథ నీరు పూర్తిగా ఉచితం

తాడ్వాయి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీరు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తాడ్వాయి మండల ఎంపీవో సవితారెడ్డి అన్నారు. బుధవారం కృష్ణాజివాడి గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. అనంతరం మిషన్ భగీరథ నీరు వంద శాతం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని గ్రామస్తులకు తెలిపారు. ఇందులో గ్రామ కార్యదర్శి చంద్రకళ, మాజీ సర్పంచ్ జంగం భూషణం ఉన్నారు.

'కంప్యూటరీకరణ చేయాలి'

తాడ్వాయి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఇందిరమ్మ ఇండ్లను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేయాలని అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. ఇందులో ఎంపీఓ సవితారెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తాడ్వాయి వాసికి గోల్డ్ మెడల్

తాడ్వాయి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం నిర్వహించినటువంటి 10 సంవత్సరాల స్నాతకోత్సవ సభలో తాడ్వాయి వాసి గోల్డ్‌మెడల్ సాధించారు. యూనివర్సిటీ చాన్సలర్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ తెలుగు అధ్యయన శాఖలో అత్యధిక మార్కులు సాధించినందుకు 2018 - 2020 బ్యాచ్‌కి చెందిన తాడ్వాయి గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థికి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

హామీలు నెరవేర్చాలని వినతి

లింగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బుధవారం లింగంపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్‌లను రెగ్యులర్ చేస్తామనిమెనిఫేస్టోలో పెట్టి హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం మండల అధ్యక్షుడు పవన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శావరాం, మండల ప్రధాన కార్యదర్శి కాళీదాస్, కార్యదర్శి సాయాగౌడ్, చందర్ నాయక్ ఉన్నారు.

పిప్రిలో మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

ఆర్మూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏకోక్లబ్ టీం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సుమారు 100 మొక్కలు నాటారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పండ్ల మొక్కలు, నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు ట్రీ గార్డ్‌లు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డి.విశ్వనాథ్ తెలిపారు. మొక్కల పెంపకం, చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బోధన్‌ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాల అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు అందించడమే కాకుండా మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తోడ్పాటును అందిస్తున్నారన్నారు. 30 కోట్ల 98 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మహిళలను చిన్నచూపు చూశారని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడంతో విద్యార్థుల శాతం గణనీయంగా తగ్గిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాలలకు నిధులు కేటాయించి పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. గత సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇండ్లు లేని వారికి 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ సొంతింటి కల నిజం చేసిందన్నారు. ఆయిల్ పాం సాగుపై ఉద్యానవన పట్టు పరిశ్రమ, ప్రియానిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారితో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయిల్ పాం సాగు, దిగుబడిలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్, తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డిఆర్‌డిఏ పీడీ సాయాగౌడ్, డీపీఎం నీలిమ, సంధ్యారాణి, టిపిసిసి జనరల్ సెక్రటరీ నగేష్ రెడ్డి, జిల్లా నాయకులుగడుగు గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు ఉన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అక్లూర్‌లో ఇళ్లస్థలాల బాధితులకు అండగా ఉంటాం

● బీజేపీ మండల నాయకులు

వేల్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్లూర్‌లో మూడురోజులుగా ప్లాట్‌ల స్థలం కబ్జాదారులతో ఎదుర్కొంటున్న బాధితులకు బీజేపీ అన్ని విధాల అండగా ఉంటుందని మండల బీజేపీ అధ్యక్షుడు బేల్దార్ నవీన్ అన్నారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన అక్లూర్ గ్రామానికి వెళ్లి కబ్జాకు గురైన బాధితుల ప్లాట్‌ల స్థలాన్ని పరిశీలించి జరిగిన విషయాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాటాడుతూ గత 1994లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు ఇచ్చారన్నారు. అప్పట్లో కొందరు ఇళ్లు నిర్మించుకోగా, ఆర్థిక స్తోమత లేని మరికొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ పథకం కింద బాధితులు ఇళ్లు నిర్మించుకునే క్రమంలో గ్రామ బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు ఆ ఇళ్ల స్థలాన్ని కబ్జాచేసుకొని బాధితులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బాను, ఉపాధ్యక్షుడు రాజగంగారాం, కార్యదర్శి ప్రవీణ్, నాయకులు శశి, ధర్మేదర్, అక్లూర్ ప్రవీణ్, కార్యకర్తలు, బాధితులున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ఏర్గట్ల, జులై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపా ధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పదోన్నతులపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏర్గట్ల మండల పీఆర్టీయూ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, దశందర్, భాస్కర్, గంగాధర్, సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగేంద్రనగర్‌కు చెందిన శ్రావణికి ఎంఏ పీజీ విభాగంలో గోల్డ్‌మెడల్

ఏర్గట్ల, జులై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన మోత్కూరి శ్రావణి ఎంఏ పీజీ తెలుగు విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండవ స్నాతకోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన శ్రావణి కామారెడ్డిలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. ఎంఏ పీజి తెలుగు విభాగంలో గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంస పత్రాన్ని గవర్నర్ జిస్టు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకుంది.

'చర్చా కార్యక్రమానికి అనుమతి ఇవ్వండి'

వేల్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు గురువారం చర్చాకార్యక్రమానికి అను మతి ఇవ్వాలని ఎస్సై సంజీవ్‌ను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలు లబ్ధిపొందని వారితో బీఆర్ఎస్ నాయకులు అలాగే ప్రభుత్వం పథకాలను లబ్ధిపొందిన వారితో కలిసి కాంగ్రెస్ నాయకులు చర్చించనున్నట్లు ఆయా పార్టీల నాయకులు తెలిపారు. ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, నల్ల రమేష్, కొలిప్యాక శ్రీనివాస్, మోతె రాజేందర్, బబ్బురు ప్రతాప్, పిట్ల సత్యం ఉన్నారు.

'మందుల కొరత తీర్చండి'

ఆర్మూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు వ్యాపించకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఆసుపత్రిలో టెక్నీషియన్‌లు, మందుల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తు బుధవారం ప్రగతిశీల మహిళాసంఘం ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలు వి.సత్తెమ్మ మాట్లాడుతూ మండల స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌ల కొరత ఉందని, ఆసుపత్రులలో రోగ నిర్ధారణ చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్‌లు లేరన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు పద్మ, లక్ష్మక్క, ఆర్మూర్ నాయకురాలు సుల్తాన బేగం, నందిని తదితరుల పాల్గొన్నారు.

మామిడిపల్లి పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టంను ఆర్మూర్ రోటరీక్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ రజనీష్ కిరాడ్ అందజేశారు. సౌండ్ సిస్టం లేక విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని తెలిపిన వెంటనే స్పందించి సౌండ్ సిస్టంను వితరణ చేసిన దాత రజనీష్ కిరాడ్‌కు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కోటగిరి,జూలై16(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని హడ్కో కాలనీలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని బుధవారం బోధన్ సీడీపీవో పద్మ ప్రారంభించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతూ వచ్చింది. అరకొర వసతుల మధ్య చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం పనులు ప్రారంభించిన పూర్తి చేయలేదు. ఇటీవల అంగన్‌వాడీలో మిగిలిన పనులు పూర్తి చేసి కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్‌వాడీకేంద్రాలలో పౌష్టికాహారం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చందర్, సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బాలలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, నాయకులు పవన్, శంకర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక

రెంజల్, జూలై16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన లోహిత్ కార్తికేయ రావు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి లోహిత్ కార్తికేయ రావు ప్రతిభతో జవహర్ నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.

'ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

బోధన్,జూలై16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్‌మల్లన్న కవితకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు, రాష్ట్ర మైనారిటీ నాయకులు రజాక్, మాజీ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాం, నాయకులు తోకల గంగారెడ్డి, ఎన్ఆర్ఐ హైమద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, రవి శంకర్ గౌడ్, జాదవ్ ప్రవీణ్ నాయక్, నరేష్ కుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

బోధన్,జూలై16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ ప్రజలు పరిశుభ్రత పాటించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 20, 2, 1 వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. ప్రజలు తమ చెత్తచెదారాన్ని ఇంటి ముందు పడవేయకుండా మున్సిపల్ చెత్త వాహనాల్లోనే వేయాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుపై జాగ్రత్తలు పాటించాలి

కమ్మర్‌పల్లి, జూలై 16: (ఆంధ్రజ్యోతి) ఓటర్ల జాబితాలు మార్పులు, చేర్పులు నూతన ఓటర్ల నమోదు తదితర అంశాలపై బూత్‌లెవల్ అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ జి ప్రసాద్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన మండల బూత్ లెవల్ అధికారుల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటాడుతు ఓటర్ల జాబితాలో సవరణ తదిత ర అంశాలపై నిర్వహిస్తున్న ఒక రోజు శిక్షణపై అవగాహన పెంచుకుని తప్పుదొర్లకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో డూప్లికెట్ ఓటర్ల తొలగిపు, మార్పులు, చేర్పులు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ తదితర అంశాలపై కమ్మర్‌పలల్లి మండలానికి ప్రత్యేకంగా కెటాయించబడిన అధికారులు శంకర్, ప్రభాకర్ బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ నిచ్చారు. అధికారులు ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన

ఆర్మూర్ టౌన్ , జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజార్‌లో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళ సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘాల ద్వారా చేపట్టిన ఉత్పత్తులను ప్రదర్శించి అమ్మకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజు, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, పూర్ణ మౌళి, మున్సాపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

ముప్కాల్ , జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం పురస్కరించుకొని బాల్కొండ కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను సంప్రాయ దుస్తువులను ధరించిన విద్యార్థులు ఊరేగింపుగా నృత్యాలు చేస్తు గ్రామా దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఆకుల లక్ష్మణ్, విఘ్నేష్, సుపరెండెంట్ రాజేందర్; వ్యాయామ ఉపాధ్యాయుడు గణేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆసరా పింఛన్‌లు పెంచాలని డిమాండ్

కోటగిరి,జూలై16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా దివ్యాంగుల ఆసరా పింఛన్‌లు పెంచడంలో నిర్లక్ష్యం చేయడం తగదని పింఛన్‌ల పెంపుపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో దివ్యాంగులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్ 4016 రూపాయల నుంచి 6016రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. వందశాతం వైకల్యం ఉన్న వారికి 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

నాగిరెడ్డిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 21 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 12 ప్రాథమికోన్నత, ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,920 మంది విద్యార్థుల సంఖ్య ఉండగా, ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 3,131కి చేరిందన్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 211 మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులకు అధికారికంగా డిప్టేషన్‌లు పెట్టినట్టు ఆయన తెలిపారు. అందులో ఆరుగురు ఉపాధ్యాయులకు మండలంలోని వివిధ పాఠశాలల్లోనే విద్యా బోధనకు అవసరమున్న చోట డిప్టేషన్ పెట్టినట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గవర్నర్ పర్యటన సైడ్‌లైట్స్

డిచ్‌పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):

- తెలంగాణ విశ్వవిద్యాలయం డిచ్‌పల్లి క్యాంపస్ వద్ద గవర్నర్ పర్యటన దృష్ట్యా పోలీసులు మూడంచెల భద్రత కల్పించారు.
- పాస్‌లు ఉన్న వారు మాత్రమే లోనికి అనుమతించారు.
- డాగ్ స్క్వాడ్‌లతో అనువనువు శోదించారు.
- బంగారు పతకాలు, డాక్టరేట్ పట్టాలు పొందుతున్న వారితో పాటు యూనివర్సిటీ అధికారులు తెల్లని దుస్తులతో ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి.
- సభ ప్రాంగణం పక్కన 108 అంబులెన్స్, అగ్నిమాపక శకటాన్ని ముందస్తుగా ఏర్పాటు చేశారు.
- సభ ప్రాంగణానికి అర కిలో మీటరు దూరంలో ద్విచక్ర వాహనాలను పోలీసులు పెట్టించారు.
- సభ ప్రాంగణంలోకి మెటల్ డిటెక్టర్ సహాయంతో లోనికి అనుమతించారు.
- జర్నలిస్టులకు తప్ప ఇతరులకు సెల్‌ఫోన్‌లు అలౌడ్ చేయలేదు.
- గవర్నర్ సభ ప్రాంగణానికి రాగానే బెటాలియన్ పోలీసులు గాడ్ ఆఫ్ హానర్ స్వీకరించారు.
- స్టేజీపై గవర్నర్ కుర్చీ అందరికి ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేశారు.
- గవర్నర్‌తో పాటు వీసీ, రిజిస్ట్రార్, బంగారు పతకాలు తీసుకున్న వారంతా జాతీయ గీతం ఆలపనతో లేచి నిలబడి జాతీయ గీతం పాడారు.
- బంగారు పతకాలను రిజిస్ట్రార్ యాదగిరి అభ్యర్థులకు మైక్ ద్వారా పేర్లతో పిలిచి స్టేజీపైకి ఆహ్వానించారు.
- స్నాతకోత్సవం ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరగడంతో యూనివర్సిటీ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

డిచ్‌పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో రెండవ స్నాతకోత్సవానికి హాజరైన రాష్ట్ర గవర్నర్, వర్సిటీల చాన్సిలర్ జిష్ణుదేవ్ వర్మకు బెటాలియన్‌లో జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, పోలీస్ కమీషనర్ సాయిచైతన్య, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్, కమాండెంట్ సత్యనారాయణలు ఘనస్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ అతిథి గృహం వద్ద గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు.


స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు

గవర్నర్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న శ్రీజ


బెటాలియన్‌లో గవర్నర్‌కు పూలమొక్కలు అందజేస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో అగ్ర భాగంలో తెలంగాణ వర్సిటీ

» గవర్నర్, చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ

డిచ్‌పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్రం పేరుతో ఉన్న విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని గర్వంగా చెబుతున్నానని గవర్నర్, వర్సిటీల చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వ విద్యాలయంలో రెండో స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోనే ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో స్ఫూర్తిని ఇస్తున్నాయన్నారు. విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు విశేష మైన ప్రగతి పూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికే ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. 2006లో 6 కోర్సులతో ప్రారంభమై ప్రస్తుతం 7 విభాగాల్లో 24 ఉప విభాగాల 31 కోర్సులతో భిక్కనూరు, సారంగపూర్ క్యాంపస్‌తో సహా ఇక్కడ ప్రధాన క్యాంపస్‌లో విద్యావికాసం చెందడం ఆనందంగా ఉందన్నారు. గడిచిన 19 ఏళ్ల కాలంలో ఇక్కడ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనల ఉమ్మడి కృషి, అంకితభావం ప్రతిబింబిస్తుందన్నారు. స్నాతకోత్సవ ఏర్పాట్లు కేవలం విద్యాపరమైన లక్ష్యసాధన మాత్రమే కాదని విశ్వవిద్యాలయంలో నాణ్యమైన, సాంకేతికమైన ఉపాధి కల్పించే భవిష్యత్తు ప్రయాణానికి మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. 2023- 24 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం 51 శాతం పట్టభద్రులు దేశానికి నైపుణ్యాల కొరత తీరుస్తూ ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. ఈ విశ్వవిద్యాలయం అనేకమైన ఆశాజనకమైనటువంటి పారిశ్రామిక మైన విద్యాపరమైన సంబంధాలతో ముందుకు పోవడం స్వాగతించాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లు విద్య అంతిమ లక్ష్యం సృజనాత్మకమైన మానవుని తయారు చేయడంతో పాటు ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కొంటూ చారిత్రాత్మకమైన అభివృద్ధిని సృషించడం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొటారి కమిషన్ చెప్పిన విధంగా దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్దపడుతుందనేది విశ్వవిద్యాలయ విజయాలు రుజువు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీ వారి చంద్ర శేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వెళ్లిన ప్రతీ విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు కల్పిస్తాయన్నారు. ఆందోళనలు చెందకుండా అవకాశాల వైపు పరు గెత్తాలని సూచించారు. వర్తమాన కాలంలో అనేక అవకాశాలతో విద్యార్థులు త మ నైపుణ్యాలను, ఔషధాలను, అభిరుచులను ఉపయోగించుకొని అనేక రకాలుగా స్థిరపడే అవకాశం ఉందన్నారు. వారి వారి శక్తి సామర్థ్యాల మేరకు అభిరుచి మేరకు కొందరు పరిశోధకులుగా, మరికొందరు పారిశ్రామిక వేత్తలుగా, వ్యవస్థాపకులుగా, ప్రజా సేవకులుగా, విద్యావేత్తలుగా ఉన్నతంగా స్థిరపడుతున్నారన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది జీవితం అనేది పందెం లాంటిది కాదని ఇది ఒక ప్రయాణం లాంటిదని గుర్తు చేశారు. ఈ ప్రయాణానికి సమయ స్ఫూర్తి లోతైన అధ్యయనంతో పాటు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు నిర్ణయం తీసుకుంటుందన్నారు. టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న కోర్సుల వివరాలతో పాటు అవస్థాన సౌకర్యాలను సమగ్రంగా వివరించారు. విశ్వ విద్యాలయంలో సమీప భవిష్యత్తులో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 500 మంది విద్యార్థులతో అన్ని రకాల వసతులు ఉండే విధంగా బాలికల హాస్టల్‌ను, 1000 మంది కెపాసిటీతో ఉండే ఆడిటోరియాన్ని, అన్ని హంగులతో క్రీడామైదానం అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం విస్తరణలో భాగంగా విశ్వ విద్యాలయ పరిధిని నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు విస్తరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ విశ్వ విద్యాలయం మౌలికాభివృద్ధి, ప్రజా ప్రతినిధులతో పాటు బోధన బోధనేతర సిబ్బంది కృషి మీదనే ఆధారపడుతుందని తెలియజేశారు. ఈ స్నాతకోత్సవంలో 15 విభాగాల్లో 2014 నుంచి 2023 వరకు 132 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించామన్నారు. 156 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశామన్నారు. ఈ స్నాతకోత్స వంలో డీన్స్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, ప్రొఫెసర్ అరుణ, ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల హాజరయ్యారు.


మొక్కలకు నీళ్లు పోస్తున్న గవర్నర్


మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, కమాండెంట్

● **గోల్డ్ మెడల్ వస్తుందని ముందే ఊహించా**

సోనల్ వ్యాస్ (ఎంబీఏ 2022)



తాను తెలంగాణ విశ్వ విద్యాలయంలో 2022 సంవత్సరంలో ఎంబీఏ పూర్తి చేశాను. చదువు పూర్తయిన తర్వాత తాను రాసిన పరీక్షల ఫలితంగా గోల్డ్ మెడల్ వస్తుందని ముందే ఊహించా. అనుకున్న ఫలితంగా స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ద్వారా గోల్డ్ మెడల్ అందుకోవడం తనకు జీవితంలో మరుపురాని కలగా మిగిలిపోయింది. తాను ప్రస్తుతం యూకే ఫైనాన్స్ ఆన్‌లైన్‌లో చదువుతున్నాను.

● **చాలా సంతోషంగా ఉంది:**

శ్రీజ (ఎంబీఏ 2021)



బంగారు పతకం రావడం సంతోషంగా ఉంది. నాలుగేళ్ల తర్వాత విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించి ఈ కార్యక్రమానికి గవర్నర్‌ను పిలవడం ఆయన చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవడం మరుపురాని ఘట్టం ఇది. తాను హైదరాబాద్‌లో ప్రస్తుతం గూగుల్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

● **గోల్డ్ మెడల్ వస్తుందని ఊహించలేదు..**

జ్యోత్స్న (ఎల్ఎల్‌బీ 2018)



ఎల్ఎల్‌బీలో తనకు గోల్డ్ మెడల్ వస్తుందని ఊహించలేదని తాను గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. తాను ఈ బంగారు పతకాన్ని యూనివర్సిటీకి అంకితం ఇస్తున్నాను. మాది వేల్పూర్ మండలంలోని రామన్నపేట స్వగ్రామం. ఈ బంగారు పతకం మరింత ఉన్నత చదువులకు ఎంతో దోహదం చేస్తుంది.

● **చాలా సంతోషంగా ఉంది..**

రాజేందర్ (ఎల్ఎల్‌బీ)



టీయూలో 2017లో ఎల్ఎల్‌బీ విద్యాసంవత్సరం పూర్తి చేశాను. తమది మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామం. గోల్డ్ మెడల్ వస్తుందని యూనివర్సిటీ అధికారు లు సమాచారం ఇచ్చేంత వరకు తెలియదు. ఈ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

నట్టల నివారణకు మందులేవి?

» రెండేళ్లుగా పంపిణీ చేయని ప్రభుత్వం
» ప్రైవేట్ మెడికల్ దుకాణాలను ఆశ్రయిస్తూ పెంపకం దారులు
» ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన



ఎల్లారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులను తాగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రెండుసార్లు నట్టల నివారణ మందులను పంపిణీ చేపట్టేది. ఇప్పటికీ రెండేళ్లుగా పంపిణీ చేయకపోవడంతో గొర్రెలు, మేకల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వారు తెలుపుతున్నారు. నట్టల నివారణ మందుల సరఫరా చేయడం లేదు సకాలంలో నటల నివారణ మందులు తాగించడం వల్ల జీవాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని బరువు పెరుగుతాయని పశు వైద్యులు చె బుతున్నారు. బరువు పెరిగిన గొర్రెలు, మేకలను విక్రయిస్తే పెంపకం దారులకు లాభదాయకంగా ఉంటుంది. మండలంలో మొత్తం సుమా రు 4,200 వరకు మేకలు, 3 వేల 500 వందల వరకు గొర్రెలు ఉన్నా యి. గతంలో ప్రతీ ఏడు రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను పశువైద్య శాఖ ద్వారా అందించేది. రెండేళ్లుగా నిలిచిపోవడంతో దీంతో గొర్రెలు సరిగ్గా పెరిగాక విక్రయాలు సరిగ్గా లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేయకపోవడంతో అంత డబ్బుతో నట్టల నివారణ మందు వేస్తున్నామని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతం ఈ నెలలో పశువులకు రోగాల బారిన పడకుండా టీకాలు వేశామని పశువైద్య శా ఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నట్టల నివారణ మందులు అందించాలని గొర్రెల మేకల పెంపకం దారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే గారు.. మా గ్రామాలకు రోడ్డు నిర్మించరా?

» గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణాలు జరగవు
» ప్రజలకు పాట్లు తప్పవు
» ఇది గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆవేదన

నిజాంసాగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గారు మా గ్రామాల రహదారులు బీటీ రోడ్డుగా నిర్మాణం జరగవని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం 2023లో ఈ రహదారుల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల కింద ఆరు కోట్ల 70 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల రోడ్లను బీటీ రోడ్లుగా మా ర్చేందుకు 2023 సెప్టెంబరు నెలలో శంకుస్థాపన చేసింది. కాని ఈ రహదారుల నిర్మాణం ఇప్పటికీ నోచుకోవడం లేదు. ఈ రహదారి నిర్మాణానికి అప్పట్లో ఇచ్చిన మంజూరు రద్దయ్యాయి. నిధులు వేరే అభివృద్ధి పనులకు బదిలీ చేశారా అనే ప్రశ్నార్ధకంగా మారింది. నిజాంసాగర్ మండలంలోని ఆరేడు జిల్లా పరిషత్ రహదారి నుంచి బ్రాహ్మణపల్లి మీదుగా మారిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధుల కింద 2023-2024 ఆర్థిక సంవత్సీరం రెండు కోట్ల 70 లక్షల రూపాయలను మంజూరు చేసింది. 161వ జాతీయ రహదారి నుంచి లింగంపల్లి గ్రామం వరకు అచ్చంపేట మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నాలుగు కోట్ల రూపాయల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు నిచ్చింది. సెప్టెంబరు 2023లో ఈ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసింది. మొదట్లో ఈ రహదారుల నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ 161 రహదారి నుండి లింగంపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు ఇరుపక్కల ముళ్ళ పొదలను కూడా తొలగించారు. నిధులు వస్తాయో రావో అని ఆందోళన చెందిన కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. వర్షాకాలం వచ్చిందంటే బ్రాహ్మణపల్లి నుంచి మరిపల్లి వరకు 161 రహదారి నుండి లింగంపల్లి వరకు ఉన్న మట్టిరోడు గుంతలమయమై అధ్వానంగా మారుతూ వస్తూనే ఉందిజ ఈ రోడ్ల వెంటన వెళ్లే ద్విచక్ర వాహనాలు ఆటోలు ప్రజలు నరకయాతన పడుతూ పిట్లం మాసాన్పల్లి, నర్సింగరావు పల్లి చౌరస్తాలకు వెళ్లాల్సి వస్తుంది. అధికారం లోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 19 నెలలు గడుస్తున్నప్పటికీ ఈ రహదారులను బీటీ రోడ్లుగా మార్చాలని ఆలోచన పాలకులకు, అధికారులకు లేకపోవడంతో ప్రజలు సర్వత్రా నిరసనలు వ్యక్తం చేస్తూ ఉన్నారు. నియోజకవర్గంలో బిచ్కుంద, మద్నూర్, పిట్లం మండలాల్లో కోట్ల రూపాయలతో గ్రామీణ ప్రాంతాల రహదారులకు నిధులు మంజూరు చేశారు.


అచ్చంపేట లింగంపల్లి రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లికి వెళ్లే రహదారి ఇదే


161 జాతీయ రహదారి నుంచి అచ్చంపేట మీదుగా లింగంపల్లి వెళ్లే రహదారి ఇదే

మా ఊరి రోడ్డు మంచిగయ్యేదెన్నడో?

» గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ.2.80కోట్లు మంజూరైనట్లు ప్రకటన
» ఈసారి కూడా వంతెన నిర్మాణం కాకపోవడంతో ఆవేదనలో గ్రామప్రజలు

సదాశివనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారిన అమర్లబండ గ్రామ ప్రజలు కష్టాలు మాత్రం తీరడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో రాజకీయ నాయకులు ఉన్నతాధికారులు ఏళ్ల నుంచి వర్షాకా లం వాగు ఉధృతికి గ్రామ ప్రజల పరిస్థితి చూసి ఆ రోజు వాగ్దానాలు చేయడమే తప్ప ఇంతరవరకు అమర్లబండ వాగు గురించి పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల సమయంలో ప్రచారానికి వచ్చినప్పుడే అమర్లబండ ప్రజల కష్టాలు కనిపిస్తాయి తప్ప తర్వాత ఎ వరు తిరిగి చూడటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయం సమీపించడంతో ఎల్లారెడ్డిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అమర్లబండ వం తెనకు రూ.2.80 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. బీఆర్‌ఎస్ ప్రభు త్వం మరికొన్ని రోజుల్లో ఎన్నికలకు వెళ్తున్నందున ఎన్నికల కోడ్ వస్తుందన్న ఉద్దేశ్యంతో బ్రిడ్జి నిర్మాణం కోసం శిలాఫలకం వేశారు. శిలాఫలకం వేయడం మంత్రి ప్రకటన చే యడం చూసిన గ్రామస్థులు ఇంకా మా కష్టాలు తీరినట్లేనని సం తోషం వ్యక్తం చేశారు.


అమర్లబండ నుంచి కన్కల్ వెళ్లే రోడ్డు మార్గంలో అలుగు వద్ద దుస్థితి

వర్షాకాలం ప్రజల కష్టాలు

వర్షకాలం వాగు ఉధృతితో గ్రామ ప్రజలు గ్రామంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో ప్రత్యామ్నాయంగా గ్రామప్రజల సహాయంతో ట్రాక్టర్లపై వాగు దాటించడం తప్ప వేరే మార్గం లేకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే గ్రామప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆశ్రమం చుట్టూ వాగులు ఉండటంతో వర్షం తగ్గేవరకు ఎంత ఆపద వచ్చినా ఇంట్లోనే ఉండాల్సి రావడం తప్ప ఏమి చేయలేని గ్రామ ప్రజలు ఎంతో మంది నాయకులను, అధికారులను ఎల్లకాలం వేడుకుంటున్న ఇప్పటివరకు ఫలితం లేకుండా పోవడం విచారకరం.

ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుపైనే ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇకనైనా మా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మా పరిస్థితి కల్లారా చూసి మా బాధలు తీరుస్తాడని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైనా రూ.2.80కోట్లను సత్వరమే ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి మా గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి గ్రామ ప్రజలను ఆదుకుంటాడనే నమ్మకంతో ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. దీంతో పాటు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సదాశివనగర్, తాడ్వాయి మండలాలను కలపడానికి నిర్మించిన రోడ్డు అమర్లబండ చెరువు అలుగు వద్ద బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలం రెండు మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక శ్రద్ధ వహించి రెండు బ్రిడ్జిలను నిర్మించడంతో పాటుగా చెడిపోయిన బీటీ రోడ్డును రెవన్యూవల్ బీటీగా మార్చి ప్రజలను ఆదుకుంటాడని గ్రామ ప్రజలు ఆశగా ఎదురుచేస్తున్నారు.


ప్రధాన దారిలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

ఎన్నికలు రావడమే గ్రామ ప్రజలకు శాపమా..?

నెలరోజుల్లో ఎన్నికలు రావడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారు మంజూరు చేసింది మేమెందుకు చేయాలన్న ప్రస్తుత ప్రభుత్వ ఆలోచనతో మా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయిందా అని గ్రామ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంజూరైనా నిధులు ఏమయ్యాయి ఎక్కడికి వెళ్లాయి అనే సందేహం గ్రామస్థుల మదిలో కలగడం విశేషం. ఒక ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు తప్పకుండా అవసరం ఉంటే సత్వరమే పూర్తి చేయాలన్న ఆలోచన కూడా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలలో కలుగకపోవడం విచారకరమని గ్రామస్థులు వాపోతున్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

బాన్సువాడ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామ విద్యుత్ ఉపకేంద్రానికి కూతవేటు దూరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పరిపోలంలో నీళ్లలో తెలియాడుతున్న అధికారులు మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు ట్రాన్స్ ఫార్మర్లను ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.


బీర్కూర్‌లో అధ్యాపకులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం

బీర్కూర్ కళాశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి

బీర్కూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం కామారెడ్డి జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాలలోని తరగతి గదులను ఆయన పరిశీలించారు. కళాశాలకు సంబంధించిన విద్యార్థులు, అధ్యాపకుల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం కళాశాలలో కొనసాగుతున్న తరగతుల నిర్వహణను పరిశీలించారు. కళాశాల అధ్యాపకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, అధ్యాపకులు చంద్ర శేఖర్, సత్తన్న, రంజిత్, సౌమ్య, దేవీసింగ్, సతీష్, నారగౌడ్, బాలకిషన్, సుభాష్, రాకేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి విక్రమ్

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

బీర్కూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హార్టికల్చర్ అధికారి విక్రమ్ రైతులకు సూచించారు. బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భూ సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల భూసారాన్ని పెంచి పంట దిగుబడులను పెంచడానికి మట్టి ప్రధానమని అన్నారు. మట్టిలో జీవాన్ని నింపడం వల్ల నేలలో పోషకాల లభ్యత పెరుగుతాయని అన్నారు. దీంతో తెగుళ్లను తట్టుకునే శక్తి పంటలకు పెరుగుతుందన్నారు. ఉద్యాన వన పంటల సాగు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కార్తీక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

నిజాంసాగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వన ఉత్సవ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో గంగాధర్ బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ప్రజలకు ఎటువంటి రోగాలు ప్రబలకుండా చూడాలని, గ్రామాలలో చెత్తాచెదారం లేకుండా తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని ఆయన అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలో పూర్తి చేయాలని ఆయన కార్యదర్శులకు సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా పిట్టింగ్ ప్లాంటింగ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ గంగ ప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కల గడ్డిపై నివారణ చర్యలు

నిజాంసాగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బజ్జపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం పరిసర ప్రాంతాల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు గడ్డిని పెరగకుండా నివారించేందుకు గడ్డి మందును పిచికారీ చేయిస్తున్నారు. పరిసరాల ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలకు దోమల బారి నుంచి కాపాడేందుకే చర్యలు చేపడుతున్నట్లు కార్యదర్శి భీమ్‌రావు తెలిపారు. అంతేకాకుండా పరిశుభ్రతలో భాగంగా మురికి కాలువలను గ్రామంలో కూడా శుభ్రం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న క్షేత్ర సహాయకులు

వారంతపు సమావేశాన్ని బహిష్కరించిన
ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు

నిజాంసాగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందంటూ నిజాంసాగర్ మండల ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు వారాంత సమీక్ష సమావేశాన్ని బుధవారం బహిష్కరించారు. మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర సహాయకులు అప్పుల బారిన పడి జీవనం గడుపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్ర సహాయకులు అనారోగ్యానికి గురి అయితే ఆసుపత్రులకు ఖర్చు పెట్టుకునేందుకు డబ్బులు లేక కొన్ని ప్రాంతాల్లో క్షేత సహాయకులు చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి మూడు నెలల జీతాలు చెల్లించాలంటూ ఎంపీడీవో గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి మండలాలలోని క్షేత్ర సహాయకులు ఉన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో ఆన్‌లైన్ నమోదు చేస్తున్న అధికారులు

ఆన్‌లైన్‌లో హాజరు నమోదు

మద్నూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలోని హసన్ టాక్లి అంగన్‌వాడి కేంద్రాన్ని మండల సూపర్‌వైజర్ దేవా కర్ణ బుధవారం సందర్శించారు. పోషణ్ ఆన్‌లైన్ ఫోటో క్యాప్చర్ నెట్వర్క్ పని చేయకపోవడంతో విద్యార్థుల హాజరు శాతం నమోదు కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మారుమూల అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లకు టూజీ నెట్‌వర్క్ ఉండడం వల్ల గర్భిణీల, బాలింతల చిన్నారుల నమోదు శాతం ఆలస్యం జరుగుతుంది. కాబట్టి సంబంధిత నెట్‌వర్క్ ఇంచార్జి బాలకృష్ణ అంగన్‌వాడి కేంద్రాలను పరిశీలిస్తూ విద్యార్థుల ఆదర్శ శాతాన్ని నమోదు చేస్తున్నారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించే విధంగా కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు.

ఘనంగా మైడి హనుమాన్ ఆలయ మండల పూజ

బాన్సువాడ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలోని మైడి హనుమాన్ ఆలయ పునఃప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా బుధవారం సాముహిక పంచామృత అభిషేకాలతో పాటుగా సింధూర పూజ, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ శాఖలపై ఏసీబీ నజర్

(5వ పేజీ తరువాయి)

ఏసీ బీ అధికారులు దాడులు చేసి రికార్డులో లేని పెద్దమొత్తంలో నగదును సీజ్‌చేశారు. ఆర్‌టీఏ కాకుండా పోలీసుశాఖపై ఏసీబీ దృష్టి పెట్టి లంచాలు తీసుకునేవారిని పట్టుకుంటున్నారు. ఆరు నెలల కాలంలో పోలీసు శాఖలోని నలుగురు పోలీసు అధికారులు, సిబ్బంది ఏసీబీకి పట్టుబడ్డారు. గతంలో రెవెన్యూ, విద్యుత్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు.

పక్షం రోజుల్లో ఆర్‌టీఏ చెక్‌పోస్టుల్లో తనిఖీలు

ఆర్‌టీఏ కార్యాలయంతో పాటు చెక్‌పోస్టులపై ఏసీబీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆర్‌టీఏ కార్యాలయంలో ఫైసల్ ఇస్తే కాని పని కావడం లేదని, చెక్‌పోస్టుల వద్ద చేయి తడిపితే కానీ వాహనాలు ముందుకు కదలవని ఏసీబీకి ఫిర్యాదులు వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలోని ఆర్‌టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ నిఘా పెట్టింది. గత పది రోజుల కిందట మద్నూర్ మండలం సలాబత్‌పూర్ వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుపై అర్ధరాత్రి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. తెల్లవారు జాము వరకు చెక్‌పోస్టులో సోదాలు చేయగా రికార్డుల్లో, లెక్కల్లో లేని సుమారు రూ.1లక్షకు పైగా నగదును గుర్తించి సీజ్ చేశారు. ఈ ఘటన జరిగి పది రోజులు కాకముందే భిక్కనూరులోని జాతీయ రహదారిపై ఉన్న ఆర్‌టీఏ చెక్ పాయింట్‌పై బుధవారం ఏసీబీ రైడ్ చేసింది. చెక్‌పాయింట్ మీదుగా వెళ్లే భారీ వాహనదారుల నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. చెక్ పాయింట్‌లో రికార్డుల్లో, లెక్కలో లేని రూ.68 వేల నగదును ఏసీబీ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. అదేవిధంగా నలుగురు ప్రైవేట్ వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

ఆరు నెలల్లో నలుగురు పోలీసులు

జిల్లాలో గత ఆరు నెలల కాలంలో పోలీసుశాఖకు చెందిన నలుగురు ఏసీబీకి పట్టుబడ్డారు. గత ఆరు నెలల క్రితం లింగంపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్, రైటర్ రామస్వామిలు ఓ నిందితునికి స్టేషన్ బెయిల్ విషయంలో రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన జరిగి నెలరోజుల గడకవముందే అదే పోలీసుస్టేషన్‌కు చెందిన ఎస్‌ఐ సుధాకర్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ చీటింగ్ కేసులో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12,500లు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. మే 23న కోర్టు కేసులో ఓ కానిస్టేబుల్, కోర్టు పీపీ రూ.10 వేలు లంచం తీసుకుంటూ దొరికాడు. ఇలా ఆరు నెలల వ్యవధిలోనే పోలీసుశాఖకు చెందిన నలుగురు పోలీసులు పట్టుబడడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వశాఖలపై ఏసీబీ నిఘా

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖల్లో పలువురిపై అవినీతి ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు వెళ్తున్నట్లు సమాచారం. గతంలో ఇవే శాఖల నుంచి పలువురు అధికారులు, సిబ్బంది లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా ఏసీబీ అధికారుల దాడులను పట్టి చూస్తే ప్రభుత్వ శాఖలపై అవినీతి నిరోధకశాఖ నిఘా పెట్టినట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

బలోపేతం దిశగా న్యాయ వ్యవస్థ

(5వ పేజీ తరువాయి)

ఈ రోజును ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టేలా ప్రజలను ప్రోత్సహిస్తుంది. అనేక నేరాల నుంచి ప్రజలను రక్షించడంతో పాటు దేశశాంతి,భద్రత భంగం కలిగించే వ్యక్తులకు హెచ్చరికగా న్యాయవ్యవస్థ పనిచేస్తుంది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవమని కూడా పిలుస్తారు. దీనిని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ గుర్తింపుగా జరుపుకుంటారు.

సంవత్సరం కిందట న్యాయ వ్యవస్థల్లో కొత్త మూడు చట్టాలు

దేశంలో బ్రిటిష్ వలసపాలన నాటి చట్టాల స్థానంలో మూడు నూతన నేర న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయి. గతంలో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, భారత సాక్షాధార చట్టాల స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సమ్మేత, భారతీయ నాగరి సురక్ష సమ్మేత, భారతీయ సాక్ష్య అధ్వానీయ మూడు కొత్త చట్టాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. బాధితుల హక్కులను పరిరక్షిస్తునే కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా కొత్తచట్టాలను రూపొందించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోనే ఎన్‌డీఏ ప్రభుత్వం 2024లో ఈ మూడు నూతన నేర చట్టాలకు సంబంధించిన బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అనంతరం పార్లమెంట్ స్థాయిసంఘ పరిశీలనకు పంపింది. స్థాయి సంఘ నివేదిక అనంతరం లోక్‌సభలో, రాజ్యసభలో వీటిని ఆమోదించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలుపడంతో చట్టరూపం దాల్చింది.

జిల్లా కోర్టుల్లో 14 వేలకు పైగా కేసులు

న్యాయస్థానాల్లో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటున్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థ ప్రభుత్వాలు కొత్తచట్టాలను అమలులోకి తీసుకువస్తున్నాయి. సుప్రీం, హైకోర్టుల్లోనే కాకుండా కిందిస్థాయి కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారం కాక బాధితులు సంవత్సరాల తరబడి న్యాయం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుందలో న్యాయస్థానాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో 6 ప్రధాన కోర్టులు ఉన్నాయి. డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు, అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్‌కోర్టు,అసిస్టెంట్ సెషన్స్ కోర్టు(సబ్‌కోర్టు), జ్యూడిషయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్(జూనియర్ సివిల్‌జడ్జ్),ఫోక్సో జిల్లాకోర్టు, అడిషనల్ జ్యూడిషియల్ సివిల్ జడ్జ్(మొబైల్‌కోర్టు)కోర్టుల్లో సుమారు 8 వేలకు పైగా కేసులు ఉన్నాయి. వీటితో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుందలోను కోర్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మరో సుమారు 6వేలకు పైగా కేసులు ఉన్నట్లు న్యాయవ్యవస్థ వర్గాలు చెబుతున్నాయి.

జవాబుదారి తనాన్ని నిర్ధారించడం

● వేణు, న్యాయవాది, కామారెడ్డి



అంతర్జాతీయంగా తీవ్రమైన నేరాలు, యుద్ధ నేరాలు, హింసబలవంతపు అదృశ్యాలకు జవాబుదారితనాన్ని నిర్ధారించడానికి అంతర్జాతీయ న్యాయదినోత్సవం లక్ష్యం. ప్రతి ఒక్కరు ఆర్థిక, రాజకీయ,సామాజిక హక్కులు సమాన అవకాశాలకు అర్హులని ఆలోచనతో బాధితులకు అందించాలనే విధంగా అంతర్జాతీయ న్యాయదినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రస్తుతం రష్యా, ఉక్రేయిన్ యుద్ధాలు, ఇజ్రాయిల్, ఇరాన్‌యుద్ధాలు జరుగుతున్న క్రమంలో అంతర్జాతీయ న్యాయదినోత్సవానికి చాలా ప్రాధాన్యత ఉంది. యుద్ధాలలో బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

ఇప్పుడిప్పుడే కోర్టుల్లో కేసులు తగ్గుతున్నాయి

● దేవరాజ్‌గౌడ్, సీనియర్ న్యాయవాది, కామారెడ్డి



న్యాయవ్యవస్థలో కొత్తచట్టాలు అమలులోకి రావడంతో ఇప్పుడిప్పుడే కోర్టులో అనేక కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుంది. కొత్తజిల్లాలు ఏర్పాటుకావడంతో పాటు కొత్తకోర్టులను న్యాయవ్యవస్థ ఏర్పాటుచేసింది. దీంతో కేసులు పరిష్కారం అవడంతో పాటు బాధితులకు న్యాయం అందే అవకాశాలు ఉన్నాయి. నూతన హైకోర్టుకు కూడా రాష్ట్రప్రభుత్వం పెద్దఎత్తున బడ్జెట్‌ను కేటాయించింది. న్యాయవాదులకు, జ్యూడిషియల్ వ్యవస్థ మీద ప్రభుత్వం అనుకులంగా ఉంది.

ఇకనైన రోగులకు మెరుగైన సేవలు అందేనా?

(5వ పేజీ తరువాయి)

వ్యక్తుల వివరాలను ఆరాతీసి ఆసుపత్రిలోని ఇతర సిబ్బందికి ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి ఆసుపత్రిలో లేని 2డీకో, సీటిస్కాన్,ఎంఆర్‌ఐ తదితరసేవలు బయట చేయిస్తుండేవారు. కాని ఆయా నిర్వహకులకు సకాలంలో బిల్లులు అందించకపోవడంతో ప్రస్తుతం ఆ సేవలు మూలకు పడ్డాయని తెలుస్తుంది. ఆ పరీక్షలు చేయించుకుని వస్తేనే చికిత్సలు అందించే అవకాశాలు ఉంటాయని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ కింద సేవలు అందడం లేదని తెలిసేలా చేస్తు రోగులు ఆరోగ్యశ్రీ అందించే ప్రైవేట్ ఆసుపత్రులకు పరోక్షంగా వేళ్లెలా చేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే నిధులు రాకుండా పోతున్నాయనేది గతంలో అందిన సేవలకు గత కొన్నినెలలుగా అందుతున్న సేవలను పరిశీలిస్తే తెలిసిపోతుంది.

నేడు జీజీహెచ్‌లో హెచ్‌డీఎస్ సమావేశం

కామారెడ్డి జీజీహెచ్ హెచ్‌డీఎస్ సమావేశాన్ని గురువారం ఆసుపత్రిలో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు,ఎంపీ హజరుకానున్నట్లు సమాచారం. కలెక్టర్ చైర్మన్‌గా, సూపరిటెండెంట్, ఎమ్మెల్యేలు ఈ సమావేశం నిర్వహించి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, నిధుల కేటాయింపులు, సిబ్బంది పనితీరుపై చర్చించనున్నారు.అయితే ఎన్నో ఏండ్లుగా కాగితాలకే పరిమితమవుతున్న హెచ్‌డీఎస్ మీటింగ్ నేడైన పరిపూర్ణంగా జరిగి మార్పు కనిపిస్తుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.నిత్యం ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలలో లేదంటే పీఏలకు, చోటామోటా నాయకులకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై మొర పెట్టుకుంటున్నవాటికి చెక్‌పెడుతారో లేదో వేచిచూడాలి.

ఇందిరమ్మ ఇళ్లను సక్రమంగా నిర్వహించాలి

రామారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సక్రమంగా నిర్మించాలని రామారెడ్డి, సదాశివనగర్ ఉమ్మడి మండలాల గృహ నిర్మాణ శాఖ ఏఈ సుచిత్ర పేర్కొన్నారు. బుధవారం రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి 35 ఇండ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు బేస్మెంట్ వరకు 17 ఇండ్లు పూర్తి అయినాయని వీటి బిల్లులు త్వరలోనే బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాకలి నరేందర్, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, గీరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి గ్రామంలో మొబైల్ వైద్యఆరోగ్య శిబిరం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణీ గ్రామంలో బుధవారం ఇంటిగ్రేటెడ్ మొబైల్ వై శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంలోని ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణ, టీబీ నియంత్రణ పట్ల అవగాహన కల్పించారు. బీపీ, షుగర్, తదితర వైద్య పరిక్షలు చేసి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మొబైల్ వైద్య కౌన్సిలర్లు అనీల్, శృతి, ల్యాబ్ టెక్నిషియన్ నవీన్, స్థానిక పల్లె ధవాఖాన వైద్యులు శివకృష్ణ, ఆరోగ్య పర్యావేక్షకురాలు రాజేశ్వరీ, ఏఎన్ఎం స్వరూప, ఆశవర్కర్ సుజాత, గ్రామపంచాయతీ కార్యదర్శి సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ బ్యాంకు, ఏటీఎంలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి : ఏఎస్పీ

భిక్కనూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతీ బ్యాంకు, ఏటీఎంలలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. బుధవారం భిక్కనూరు సర్కిల్ పరిదిలోని బ్యాంకు మేనేజర్లతో భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ బ్యాంలు, ఏటీఎంల భద్రత దృష్ట్యా భిక్కనూరు సర్కిల్ పరిదిలోని భిక్కనూరు, రాజంపేట, దోమకొండ, బీబీపేటలోని ప్రతి బ్యాంకులో, ఏటీఎం సెంటర్లలో అన్నిదిశల్లో స్పష్టంగా కనిపించే విధంగా కెమెరాలను ఏర్పాటు చేయాలని, బ్యాంకులలో అలారం సిస్టమ్ పనిచేస్తుందా లేదా అని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, ప్రభాకర్, స్రవంతి, ఆయాగ్రామాల బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బాన్సువాడ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామశివారులో బుధవారం హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యులు ఇమ్రాన్ పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేవారు.

కాంగ్రెస్ కార్యాలయ సిబ్బందికి సన్మానం


జిల్లా కార్యాలయ సిబ్బందిని సన్మానించిన దృశ్యం

కామారెడ్డి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అధికార పార్టీ ప్రధాన కార్యాలయం సిబ్బందిని జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీలు సన్మానించారు. కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీ నివాసంలో కొనసాగుతున్న కాంగ్రెస్ జిల్లా కార్యాలయం ఏర్పాటుచేసి 45 సంవత్సరాలు పూర్తికావడంతో ఫోటో గ్యాలరిని ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా జిల్లా కార్యాలయాన్ని సందర్శించి ఫోటో గ్యాలరీని పరిశీలించి కేక్ కట్ చేశారు. అనంతరం కార్యాలయాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది గంగాధర్, సహాయ సిబ్బంది మల్లయ్య, రజాక్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ తన తండ్రి మహమ్మద్ మాసుమ్ 1980లో కామారెడ్డి గ్రామ పంచాయతీ సభ్యుడిగా ఉన్నప్పుడు నివాసంలోనే కాంగ్రెస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. కామారెడ్డి జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కార్యాలయంగా మార్చమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యాలయం మాకెంతో కలిసి వచ్చిందని డిసెంబర్ 9 న ప్రమాణస్వీకారానికి ప్రజలందరూ తరలిరావాలని ఇక్కడే నుంచే ప్రకటించారని తెలిపారు. బీసీ డిక్లరేషన్ డ్రాఫ్ట్ చేసి ఎన్నికల హామీగా ప్రకటించి ప్రస్తుతం అమలు చేయడం జరిగిందని తెలిపారు.

'ఆలయం చుట్టూ దుకాణాలు వద్దు'

మద్నూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దుకాణాలు వేయరాదంటూ రథం గల్లీవాసులు మద్నూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దుకాణాలు వేయడం వల్ల ప్రతి సంవత్సరం రథం ఊరేగింపు సమయంలో, ఎడ్ల పొలాల సమయంలో ఇబ్బందులు వస్తాయని అందుకని దుకాణాలు వేయకుండా నిలిపివేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఎల్లారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఎల్లారెడ్డి ఆర్‌డీఓ పార్థ సింహారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. వసతి వివరాలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు సూచించారు. ఆయనతో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్డీవోను కలిసిన టీఎన్జీవోస్ బృందం

ఎల్లారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎల్లారెడ్డి ఆర్డీవో కె.పార్థ సింహారెడ్డిని, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అధికారిణి కార్యాలయంలో టీఎన్జీవోస్ బృందం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ డివిజన్ అధ్యక్షుడు లచ్చిగారి మహిపాల్, ప్రధాన కార్యదర్శి చరణ్, కోశాధికారి రవీందర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జై. వసంత, ముఖిద్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

ఎల్లారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇటీవల లక్ష్మాపూర్ ప్రాథమిక పాటశాలలో పని చేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయురాలు సుధారాణి వారి తల్లి గొట్టపాటి లక్ష్మీ నర్సమ్మ జ్ఞాపకర్థాం సందర్భంగా 26 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన ఉన్నత స్థానంలో ఉంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు వస్తాయని తెలిపారు. అనంతరం సుధారాణిని పాఠశాల బృందం శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు దరి చేరకుండా చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాదులు దరిచేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు రమ, ఉపాధ్యాక్షురాలు సత్తెమ్మలు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏవో అహ్మద్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే విషజ్వరాలు టైఫాయిడ్,డెంగీ లాంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాటికి పొంతన లేదని అన్నారు.మండలస్థాయిలో ప్రభుత్వ వైద్యుల కొరత ఉందని, వైద్యులు సమయపాలన పాటించడం లేదని తెలిపారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిత, పుష్పలత, యాదమ్మ, లక్ష్మీరూప తదితరులు పాల్గొన్నారు.

బ్రాంజ్ మెడల్స్ సాధించిన కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ

కామారెడ్డిటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి):వరల్డ్ పోలీసు అండ్ ఫైర్‌గేమ్స్-2025లో షాట్‌పుట్, 110 మీటర్ల పరుగులో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించిన కామారెడ్డి జిల్లా కానిస్టేబుల్ మొహమ్మద్‌బాబాను బుధవారం ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలోని బర్మింగ్‌హోమ్ నగరంలో జరిగిన అంతర్జాతీయ క్రీడాపోటీల్లో మన తెలంగాణ రాష్ట్రం నుండి భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి రెండు బ్రాంజ్ మెడల్స్ పతకాలు సాధించాడని తెలిపారు. ఇది పోలీసుశాఖకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ప్రతిభ వంతులకు ఎల్లప్పుడు సహకరిస్తామని తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

గాంధారి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పీడీఎస్‌యూ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను చెల్లించాలని పోస్టుల ద్వారా పంపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి ప్రధాన ఏజెండాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల కోట్ల స్కాలర్‌షిప్ రియింబర్స్‌మెంట్ పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. వెంటనే స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్‌ను విడుదలచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యాక్షుడు మోజీరాం, నాయకులుగణేష్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

హిందువులు కలిసి ఉంటేనే విజయం

రామారెడ్డి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆలయాల రక్షణకు హిందూ ధార్మిక, సనాతన ధర్మ సంస్కృతిని కాపాడ్డానికి ప్రతి హిందువులో చైతన్యం తీసుకురావడానికి విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఏర్పాటు చేయడం జరిగింది. హిందువులను సంఘటితం చేస్తూ ఆలయాలను కాపాడుతూ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో బుధవారం విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కమిటీలను నిర్మిస్తూ ఆ కమిటీ ద్వారా హిందూ కార్యక్రమాలు మొదలుపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏకగ్రీవం చేస్తూ జిల్లా కోశ్యాధ్యక్షులు అమ్ముల శ్రీనివాస్, జిల్లా సత్సంగ ప్రముక్ బోల్లని శ్రీనివాస్, బజరంగ్ దళ్ జిల్లా సహసంయోజక్ కడెం సాయికుమార్, విశ్వహిందూ పరిషత్ రామారెడ్డి ప్రకండ అధ్యక్షుడు పటేండ్ల రమేష్ రెడ్డి, కోశాధ్యక్షులు బత్తిని శ్రీకాంత్, బజరంగ్దళ్ రామారెడ్డి ప్రఖండ సురక్ష ప్రముక్ గడ్డం విష్ణువర్ధన్, మద్దికుంట గ్రామ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు గుండె బోయిన భానుచందర్ గారు, ఉపాధ్యక్షులు రేకులపల్లి ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డెల శేఖర్, కోశాధికారి చిల్లపురం రాజు పాల్గొన్నారు.

భిక్కనూరులో భారీగా పోలీసు బందోబస్తు

భిక్కనూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ పర్యటన సందర్భంగా బుధవారం జిల్లా ముఖ్యద్వారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామం నుండి మండల శివారు లక్ష్మీనగర్‌తాండా వరకు భిక్కనూరు సీఐ సంపత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగున సర్కిల్ పరిదిలోని నాలుగు పోలీసుస్టేషన్ల సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గవర్నర్ వాహనాల రాక సందర్భంగా రోడ్ల పైకి వాహనాలను కానీ ప్రజలను కానీ పోలీసులు అనుమతించలేదు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఆంజనేయులు, ప్రభాకర్, స్రవంతి పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి		బాన్సువాడ	
దర్శన్	సూపర్‌మెన్	మహేశ్వరి	ఓ భామ అయ్యో రామ
ప్రియా 70	ఓ బామ అయ్యేరామ	వెంకటేశ్వర	ద 100
ప్రియా 35	కుబేర		

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

